క్లుప్తంగా

నేడు మహాజన సంపర్క్ అభియాన్

కొడంగల్: కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి ఆదివారం నాటికి 9 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. పార్టీ పెద్దల ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు కోస్గి పట్టణం బాలాజీ ఫంక్షన్ హాల్‌లో మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల నుంచి పార్టీ ప్రతినిధులు పాల్గొననున్నారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కుల వృత్తులకు రూ.లక్ష

బంట్వారం: కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి ప్రభుత్వం రూ.లక్ష చొప్పు ఆర్థిక సహాయం అందజేస్తుందని ఎంపీడీఓ బాలయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాయం అందుతుందని, వెనుక బడిన వర్గాల కుల వృత్తులు, చేతి వృత్తుల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫొటో, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్ల నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 20వ తేదీ వరకు అర్జీ పెట్టుకోవాలని చెప్పారు.

ఆర్థిక సహాయం

యాలాల: రాస్నం గ్రామానికి చెందిన గంజాయి యాదప్ప శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ సంపత్‌కుమార్ బాధిత కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సహాయం గ్రామస్తులతో అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మొగులప్ప, రమేష్ కుమార్, రాములు, సిద్ధూ, నర్సింహులు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సీఎం సహాయనిధి



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎంపీపీ

పరిగి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయ నిధి అందుతుందని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. రంగాపూర్ గ్రామానికి చెందిన మహేందర్ రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగి ఇంటికే పరిమితం అయ్యాడు. వైద్య చికిత్స కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా.. రూ.1.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆ చెక్కును ఎంపీపీ శనివారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

పరిగి: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఈనెల 14న చేపట్టే చలో బస్‌భవన్ కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని టీజీ ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ కోరారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్‌డిపో ఎదుట చలో బస్‌భవన్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు తక్షణమే వేతన సవరణ చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి.. ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలి

మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస



చెస్ట్ ఎక్స్‌రేకు బారులు తీరిన రోగులు

బంట్వారం: క్షయవ్యాధి నియంత్రణకు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస అన్నారు. శనివారం బంట్వారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి లక్షణాలున్న 160 మందికి చెస్ట్ ఎక్స్‌రేలు తీశారు. పేషెంట్లను గుర్తించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ త్రివర్ణ, ఫార్మాసిస్టు అమరేందర్, ఎంపీహెచ్‌ఓ ఐలయ్య, ల్యాబ్ టెక్నీషియన్స్ శంకర్, రాజేందర్, అశోక్, నరేందర్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రగతి పరుగులు

- జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న గ్రామాలు
- కొత్త జీపీల ఏర్పాటుతో పరిపాలన సులభతరం
- సుపరిపాలన దినోత్సవంలో ప్రజాప్రతినిధులు

'పరిపాలన సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం కొత్తగా జీపీలు ఏర్పాటు చేసింది. దీంతో పల్లెల్లో అభివృద్ధి పరుగులు తీస్తోంది. ప్రజలకు సత్వరమే సేవలు అందించగలుగుతున్నాం' అని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సుపరిపాలన సంబురంలో వారు మాట్లాడారు. ఉమ్మడి పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరగాలంటే తీవ్ర జాప్యం జరిగేదని, కొత్త గ్రామాల ఏర్పాటుతో పరిపాలన సులభతరం అయిందని చెప్పారు.



అనంతగిరి: కామరెడ్డిగూడలో కేక్‌కట్ చేస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ

అనంతగిరి: కొత్త జీపీలు ఏర్పాటు చేయడంతో గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని, ప్రజలకు సత్వరమే సేవలను అందించ గలుగుతున్నామని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కామరెడ్డిగూడ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సుపరిపాలన దినోత్సవంలో.. కొత్తగా ఏర్పడిన కామరెడ్డిగూడ, బురాన్‌పల్లి గ్రామాల్లో కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు గ్రామాలన్నీ అభివృద్ధిలో పరుగులు తీస్తూ.. జాతీయ స్థాయిలో బహుమతులు అందుకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, ఏపీఎం శీను, బురాన్‌పల్లి సర్పంచ్ మమత, పంచాయతీ కార్యదర్శులు రాంరెడ్డి, శిల్ప, నాయకులు సాయిగౌడ్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో నంబర్ వన్

పరిగి: దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి తెలంగాణలో జరిగిందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలబెట్టారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు రవీందర్, నాగేశ్వర్, కృష్ణ, వెంకటేశ్, నాయకులు రవికుమార్, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త జీపీల్లో..

యాలాల: కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఎంపీఓ యాదయ్య, బషీర్‌మియాతండా సర్పంచ్ మిత్రు నాయక్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తండాలో సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలక వర్గం కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉమ్మడి పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరగాలంటే తీవ్ర జాప్యం ఉండేదని, కొత్త జీపీల ఏర్పాటుతో పరిపాలన సులభతరం అయిందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, రమాదేవి తదితరులు ఉన్నారు.

కార్మికుల సేవలు మరువలేనివి

కొడంగల్: కార్మికుల సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సుపరిపాలన దినోత్సవంలో పారిశుద్ధ్య కార్మికులను మున్సిపల్ చైర్మన్ సన్మానించి మాట్లాడారు. ప్రజలు ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని, కొత్తగా భవనాలు నిర్మించుకునే వారు నిబంధనలు పాటించాలని కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజల భాగస్వామ్యంతో పురోగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కృష్ణన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: పాలనా వ్యవస్థ ప్రజలకు అందుబాటులో ఉండేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారని తిమ్మాపూర్ సర్పంచ్ శేఖర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తిమ్మాపూర్, శాపూర్, గుర్రంగట్టు తండా, జంశాద్‌పూర్, దార్గులపల్లి, నర్సాపూర్ పెద్దతండా, మల్లికార్జునగిరి, గుండ్ల మర్పల్లిలో కార్యదర్శులు, సర్పంచ్‌లు కేక్‌కట్ చేసి సుపరిపాలన సంబురాలు జరుపుకొన్నారు.



పరిగి: సుపరిపాలన దినోత్సవంలో మున్సిపల్ చైర్మన్ తదితరులు



యాలాలలో..



కొడంగల్‌లో కార్మికులను సన్మానించిన మున్సిపల్ చైర్మన్

'గిరిజనులను విస్మరిస్తున్న ప్రభుత్వం'

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరిస్తుందని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గిరిజనులకు ఎన్నో హామీలు ప్రకటించి, వాటిని అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తొమ్మిదేళ్లుగా మూడెకరాల భూమి, గిరిజనబంధు, పోడు భూములు ఇస్తానని ఎన్నో సభల్లో చెప్పారని పేర్కొన్నారు. కేవలం ఓట్ల కోసమే గిరిజనులను వాడుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేని యెడలా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నూతన కమిటీ ఎన్నిక

దౌల్తాబాద్: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) మండల నూతన కమిటీని శనివారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మదకిష్టప్ప ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పురుషోత్తం(అంతారం) ఉపాధ్యక్షుడిగా ఏర్పుల వెంకట్‌రాములు, ప్రధాన కార్యదర్శిగా మాణిక్యప్ప, కార్యదర్శిగా రమేష్, కృష్ణ, కన్వీనర్‌గా మురళిని ఎన్నుకున్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు జోరుగా మొక్కజొన్న

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 955 బస్తాల మొక్కజొన్న సంచులు వచ్చాయి. క్వింటాల్‌కు రూ.1,850 నుంచి రూ.1,900 వరకు ధర పలికింది. అలాగే ధాన్యం వెయ్యి బస్తాలు రాగా క్వింటాల్‌కు రూ.1,710 నుంచి రూ.1,880 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు.

నేను బీఆర్‌ఎస్ సర్పంచ్‌ను..

- సమాచారం ఇవ్వకుండా ఇళ్ల పట్టాలు ఎలా ఇస్తారు?
- న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా: సర్పంచ్ శివలీల



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ శివలీల

పెద్దేముల్: 'నేను బీఆర్‌ఎస్ సర్పంచ్‌ను. పంచాయతీ తీర్మానం లేకుండా, స్థానిక సర్పంచ్‌కు తెలియకుండా, లబ్ధిదారుల గురించి గ్రామంలో సర్వే చేయకుండా అధికారులు ఇళ్ల పట్టాలు ఎలా పంపిణీ చేస్తారు' అని రుక్మాపూర్ సర్పంచ్ శివలీల ఆవేదన వ్యక్తంచేశారు. నిజమైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు వచ్చే వరకు పోరాటం చేస్తానని ఆమె చెప్పారు.

భారీగా డబ్బులు వసూళ్లు!

రుక్మాపూర్ గ్రామంలో సర్వే నంబర్ 17లో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు భూమి శుద్ధి చేయించారు. అర్హుల జాబితా ఇవ్వాలని రెవెన్యూ అధికారులు సర్పంచ్‌కు సమాచారం ఇవ్వగా.. రెండు రోజుల ముందు 18 మంది పేర్లతో కూడిన జాబితాను తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి అందచేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ నెల 9న సర్పంచ్ సమాచారం ఇవ్వకుండా.. తాండూరులో జరిగిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అధికారులు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేతుల మీదుగా పలువురికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయించారు. ఇదే విషయమై సర్పంచ్ తహసీల్దార్‌ను వివరణ కోరగా.. సరైన సమాధానం ఇవ్వలేదని, నిజమైన లబ్ధిదారులకు పట్టాలు అందలేదని వాపోయారు. పట్టాల పంపిణీలో లబ్ధిదారుల నుంచి భారీగా డబ్బులు వసూళు చేశారని ఆమె ఆరోపించారు. ఇదే విషయంపై తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మప్పలపై కలెక్టర్‌లకు ఫిర్యాదు చేస్తానని, న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు పద్మమ్మ, గ్రామస్తులు రాచయ్య, అశోక్, వెంకటప్ప, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వారాంతపు సంతలు

- ఈజీఎస్ నిధులతో షెడ్ల నిర్మాణం
- పెరగనున్న ఉపాధి అవకాశాలు
- జీపీలకు సమకూరనున్న అదనపు ఆదాయం



రుద్రారంలో వారాంతపు సంత

కొడంగల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో వారాంతపు సంతలు(అంగళ్లు) నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ఇందుకు సంబంధించిన షెడ్‌లను ఈజీఎస్ నిధులతో నిర్మించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. పంచాయతీలను సైతం భాగస్వాములను చేసింది.

ఉపాధి అవకాశాలు..

ప్రభుత్వ తాజా నిర్ణయాన్ని పంచాయతీలు సద్వినియోగం చేసుకుంటే.. జీపీకి ఆదాయంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అంతే కాకుండా స్థానికులకు తాజా పండ్లు, కూరగాయలు, ఇతరత్రా సామగ్రి లభిస్తుంది. రైతులు పండించిన కూరగాయలను విక్రయించుకునేందుకు వీలు కలుగుతుంది. ఇదిలా ఉండగా.. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు చొరవ తీసుకుంటే సంత ఏర్పాటుకు కావాల్సిన నిధులు త్వరగా సమకూరడం, షెడ్ల నిర్మాణంలో వేగం పెరుగుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. భాగస్వామ్యంగా ఉన్న పంచాయతీలు కూడా తమవాట వెచ్చించాల్సి ఉంటుంది. ఈ నిధులతో ప్లాట్‌ఫాం, నీటి వసతి, మూత్రశాలలు, డ్రైనేజీలు, పార్కింగ్ స్థలం తదితర వసతులు కల్పిస్తూ అభివృద్ధి వంటి పనులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రతి గ్రామ పంచాయతీలో మార్కెట్ సౌకర్యం కలుగుతుంది. ఇప్పటివరకు సంతలు లేని గ్రామాల్లో షెడ్లను నిర్మించేందుకు మార్గం సుగమమవుతుంది. సంతలో వ్యాపారం చేసే వారి నుంచి పన్నుల రూపంలో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



పంచాయతీల పరిధిలో సంతలు ఏర్పాటు చేసుకునేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు ముందుకు రావాలి. స్థలం చూపించడంతో పాటు పంచాయతీ పెద్దలు చొరవ చూపితే గ్రామాలకు ఆదాయం పెరుగుతుంది. గతంలో వారాంతపు సంతల ఏర్పాటుకు అవగాహన కల్పించాం. షెడ్ల ఏర్పాటును సద్వినియోగం చేసుకోవాలి. – కృష్ణన్, డీఆర్‌డీఓ

పోరాటాల ఫలితమే ఇళ్ల పట్టాలు




లబ్ధిదారులతో దళిత నాయకులు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప

యాలాల: నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ ఘనత కార్మిక సంఘాలైన వ్యకాస, కేవీపీఎస్‌లకే దక్కుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులతో సమావేశమై మాట్లాడారు. దళితులు, బహుజనులకు ఇళ్ల పట్టాల పంపిణీ శుభపరిణామమన్నారు. అందుకు సహకరించిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. 2007 నుంచి ఇళ్ల పట్టాల కోసం అనేక పోరాటాలు చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే చొరవతో 127 మందికి పట్టాలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్కయ్య, వ్యకాస నాయకులు రమేష్, యాదప్ప, రాములు, రాజు, మహేశ్, నర్సింహులు, లాలప్ప, శివకుమార్, లక్ష్మీ తదితరులు ఉన్నారు.

కేసుల పరిష్కారానికి రాజీ మార్గమే మేలు

సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయవాదులు

చేవెళ్ల: పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించుకునేందుకు రాజీ మార్గమే ఉత్తమమని చేవెళ్ల కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్‌లు చెప్పారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో ట్రాఫిక్ కేసులపై పది రోజులుగా రిటైర్డు సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు ఆధ్వర్యంలో కొనసాగిన లోక్ అదాలత్ శనివారం ముగిసింది. ముగింపు లోక్ అదాలత్‌లో చేవెళ్ల సీనియర్, జూనియర్ సివిల్‌కోర్టుల జడ్జిలు, కోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని చెప్పారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాలు చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ పరిధిలోని పెండింగ్ ట్రాఫిక్ కేసులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు తెలిపారు. పది రోజుల్లో 1020 కేసులు. ఇతర ఈ–పెట్టి కేసులు తదితర వాటిని పరిష్కరించినట్లు తెలిపారు. మొత్తం 4928 కేసులు పరిష్కరించగా ఈ కేసులకు సంబంధించి రూ.33,24,640 జరిమానా వసూలైనట్లు చెప్పారు. పెండింగ్ కేసులు ఉన్న వారు కోర్టుల చుట్టు తిరగకుండా వారికి ఈ అవకాశం కల్పించినట్లు వివరించారు. జడ్జి సాంబశివరావు మాట్లాడుతూ.. పది రోజులుగా జరిగిన లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు పరిష్కరించుకునేలా వాహనదారులను చైతన్యం చేసినట్లు తెలిపారు.

నేడు డీసీసీ అధ్యక్షుడి రాక..

పూడూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్కేపల్లి, మన్నెగుడ, మీర్జాపూర్, బాకాపూర్, పూడూరు, అంగడిచిట్టంపల్లి, చెన్గోముల్, రేగడిమామిడిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించనున్నారని చెప్పారు. ఈ నెల 18న నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల గురించి వివరిస్తారని తెలిపారు. కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అధ్వానంగా తాండూరు రోడ్డు

కొడంగల్: కొడంగల్ నుంచి తాండూరు వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడి.. వాహనదారులకు ఇబ్బందిగా మారింది. పలుమార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

అనంతగిరి: పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. శనివారం వికారాబాద్‌లోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, పవన్, రాములు, నర్సింలు, అరవింద్, రత్నం పాల్గొన్నారు.

రోడ్డు తవ్వారు.. పూడ్చడం మరిచారు!



బీటీరోడ్డులో గుంతలను మట్టితో పూడుస్తున్న యువకులు

దోమ: ఇంటింటికీ తాగునీరు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని తీసుకువచ్చింది. ప్రధాన రోడ్లతో పాటు వీధుల్లోని సీసీరోడ్లను తవ్వి పైప్‌లైన్లు వేసి, ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చారు. కానీ తవ్విన రోడ్లను పూడ్చడం విస్మరించారు. దోమ మండలం బొంపల్లి గ్రామ శివారులో అధికారులు మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైప్‌లైన్ వేసేందుకు బీటీని తవ్వారు. పైప్‌లైన్ అనంతరం గుంతను పూడ్చకపోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్లను తవ్వుతున్నారని కానీ.. వాటిని పూడ్చేందుకు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. గుంతల రోడ్డుతో ప్రమాదాలు జరుగుతాయని గ్రహించిన స్థానిక యువకులు ప్రవీణ్‌యాదవ్, శ్రీనివాస్, రాము, ఫరీద్ స్పందించి.. మట్టితో గుంతలను పూడ్చారు. దీంతో గ్రామస్తులు యువకులను అభినందించారు. ఇలా గుంతలు తీసి వదిలేయకుండా.. పని అనంతరం వాటిని పూడ్చేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పింఛన్ పెంచడం హర్షణీయం

దోమ: సీఎం కేసీఆర్ దివ్యాంగులకు రూ.వెయ్యి అదనంగా పింఛన్ పెంచడం హర్షించదగ్గ విషయమని సర్పంచ్ కవిత అన్నారు. శనివారం బడేంపల్లి గ్రామంలో సీఎం చిత్రపటానికి దివ్యాంగులతో కలిసి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. రూ.3,016 ఉన్న పింఛన్‌ను రూ.4,116కు పెంచడం సంతోషించదగ్గ విషయమని, దివ్యాంగులు కేసీఆర్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ధారూరు: భారత వికలాంగుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నెలవారి పింఛన్ పెంచిన కేసీఆర్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమౌళి, దివ్యాంగుల నాయకులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, సర్పంచ్